క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డోర్ క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం మునిసిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, తణుకు కమిషనర్ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్ రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, నానాజీ, ఉపాధ్యక్షులు గుణ్ణం మురళీ, అశోక్‌కుమార్, గోపాలం, కమలరాజ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం, వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉంటాం



బీసీ మంత్రి వేణుగోపాలకృష్ణతో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్

ఆకివీడు: వెనుకబడిన తరగతుల ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని కార్పొరేషన్ డైరెక్టర్లు జగ్గురోతు విజయ్‌కుమార్, మేకా పార్వతి, తంగి పుష్కరరావు అన్నారు. విజయవాడలో మంగళవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖమంత్రి చెల్లబోయిన వేణు గోపాలకృష్ణను సన్మానించామని, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారని వారు వివరించారు. తూర్పు కాపు కార్పొరేషన్, గౌడ కార్పొరేషన్, ఎలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ల పదవులకు తమ పేర్లను సూచించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మ సేవలో బీజేపీ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని మంగళవారం బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. పార్టీ జాతీయ సంఘటన కార్యదర్శి శివప్రకాష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ముత్యాల రామారావు, చెల్లంకి గిరి, తాళ్లపూడి భాగ్యలక్ష్మీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

సాక్షి, భీమవరం: ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు ఎంఆర్‌పీఎస్ నాయకులు వినతిప్రతం అందజేశారు. భీమవరంలో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన వీర్రాజును కలిసి ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ముల్లంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ, జిల్లా సమన్వయకర్త రాజేశ్వర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభ ఉత్సవ ఊరేగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల 32వ జాతర మహోత్సవంలో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారి ప్రభ ఉత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. విస్సాకోడేరు పొలిమేర, భారతీయ విద్యాభవన్ రోడ్డు నుంచి ప్రారంభమై, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, విద్యుత్ దీపాలంకరణతో సాగింది. ఈ ఉత్సవాన్ని డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి పూజలు నిర్వహించి ప్రభ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ శాంతి కోసం రజకులు చేస్తున్న జాతర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. శ్రీ ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమతి కోడె విజయలక్ష్మి, యుగంధర్ దంపతులు మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా ఆదిలక్ష్మి రజక సంఘం రాజకీయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ జాతరను 8 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు.

శ్మశానవాటికలకు భూములను గుర్తించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): శ్మశానవాటికలకు అవసరమైన భూమిని వెంటనే గుర్తించాలని జేసీ జేవీ మురళీ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శ్మశానవాటికలకు అవసరమైన భూమిని తప్పక సేకరించి సంబంధిత పంచాయతీలకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లపట్టాలు మంజూరైన వారికి వెంటనే పట్టాలు అందించాలని సూచించారు.

వాహనాల వేలం

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఈబీ పరిధిలో వివిధ నేరాలలో పట్టుబడిన వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించగా, 12 మోటారుసైకిళ్లు, ఒక కారు రూ.2,92,100లకు పాటదారులు పాడి దక్కించుకున్నారన్నారు. దీనిపై జీఎస్‌టీగా రూ.52,578 అదనంగా ప్రభుత్వానికి చెల్లించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



యనమదుర్రులో ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



దుంపగడపలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 210 ఇళ్లను సందర్శించి, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మూడున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను ప్రస్తావించగా, ఎమ్మెల్యే శ్రీనివాస్ అక్కడే ఉన్న అధికారులతో చర్చించి పరిష్కరించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇంటింటికి తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీకే డ్వాక్రా మహిళలకు రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తే.. వైఎస్ తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి, ప్రజా సమస్యలు తెలుసుకుని నవరత్న పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని వివరించారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఈ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు వరకు లబ్ధి చేకూర్చారని చెప్పారు. ఈ ప్రాంతంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నాలుగు బ్రిడ్జీలకు పునాదులకు కారణమవడమే కాకుండా అప్రోచ్‌లకు రూ.36 కోట్లు మంజూరుకాగా, టెండర్ ప్రక్రియలో ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై.రవికుమార్, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, కోఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, చందు నాని, కోటా ఏసురత్నం, కాటూరి ఎస్సై, ఎడ్లపల్లి లక్ష్మణస్వామి, తులా రాంబాబు, దేవ భక్తుల దుర్గ, సర్పంచ్‌లు రామాని శివాజీ వర్మ, కోళ్ల బాలకృష్ణ, తిరుమాని ధనంజయరాజు, నాగిడి నారాయణస్వామి, కొట్టి కుటుంబరావు, చినిమిల్లి నాగన్న, కొప్పర్తి సత్యనారాయణ, నామన మహేష్, కోమటి రాంబాబు, కామన నాగేశ్వరరావు, తోట నాగు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్ష

ఆకివీడు : ఇంటింటికీ పథకం, గడప గడపలో చైతన్యంతో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో ఐదో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తమ ప్రాంతంలో రహదారులు, మంచినీరు, డ్రెయినేజీ, ఇళ్ల పట్టాల సమస్యలను స్థానికులు పీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణల్ని తొలగించవద్దని మహిళలు కోరారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు వారం రోజుల్లో స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రోడ్డు మార్జిన్లలోని పేదల ఇళ్లను తొలగించవద్దని చెప్పామన్నారు. డ్రెయిన్లు, సీసీ రోడ్లు, మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడినట్టు చెప్పారు. విద్యుత్ బిల్లు అధికంగా వచ్చి పథకాలు నిలిచిపోయిన వారు బిల్లు తగ్గించుకున్న తరువాత పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఎంపీటీసీలు పిన్నమరాజు సూర్యనారాయణ రాజు, సాదా నాగబాబు, నగర పంచాయతీ చీఫ్‌విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, కోఆప్షన్ సభ్యుడు ఎండీ జిక్కి, జి.ధనరాజు, ఉత్తరిల్లి నర్సింహరాజు, ఎండీ అలీ, జహంగీర్, నాయకులు కొట్టు మాణిక్యాలరావు, అట్లూరి సంజయ్, కోయ అయ్యన్న, కవిటం రామకృష్ణ, కురెళ్ల పోలు, నిమ్మల శ్రీను, బలరామరాజు, బండారు రాము, సీతారామ రాజు, పిన్నమరాజు సన్నీ, ఎంపీడీఓ శ్రీకర్, ఏఈలు పార్వతి, రమణమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

దళితుల పక్షాన పోరాటానికి ముందుంటాం

కాళ్ల: దళితుల పక్షాన పోరాటానికి మాల మహాసేన ఎప్పుడూ ముందుంటుందని జాతీయ అధ్యక్షుడు అలగ రవికుమార్ అన్నారు. కాళ్ల మండలం సిసలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశ్చిమగోదావరి జిల్లా మాల మహాసేన కార్యకర్తల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో దళిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మే 14న ఏలూరులో దళిత గర్జన లక్ష మందితో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్టు చెప్పా రు. ఈ సందర్భంగా మాల మహాసేన నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర కార్యదర్శిగా మద్రి కృపాదానం, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా గొల్ల ఆశీర్వాదం, భీమవరం, ఉండి, కాళ్ల మండల కమిటీలనుకూడా నియమించారు. సమావేశంలో మాల మహాసేన ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాజ్ కుమార్, నాయకులు కొవ్వాడ రాజారావు, సరెళ్ల వినోద్ కుమార్, కటారి పృధ్వి పాల్గొన్నారు.

వచ్చే నెలలో వైఎస్సార్ చేదోడు లబ్ధి

భీమవరం(ప్రకాశంచౌక్): వైఎస్సార్ చేదోడు పథకం మూడో విడత సాయాన్ని ప్రభుత్వం వచ్చే నెలలో జమచేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు రూ.10 వేల చొప్పున అందనుందని పేర్కొన్నారు. లబ్ధిదారుల పూర్తి వివరాలు సేకరించాలని, ఈకేవైసీ చేయాలని గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇంకా అర్హులుంటే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

28న మెగా వైద్య శిబిరం



మెగా వైద్య శిబిరం బ్రోచర్ విడుదల చేస్తున్న నిశాంత్‌వర్మ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య శిబిరం బ్రోచర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ విజయవాడకు చెందిన అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఉన్నత భారత్ అభియాన్ దత్తత గ్రామాలైన పెద్దఅమిరం, కోపల్లె, కాళ్లకూరు, కాళ్ల, జక్కరం గ్రామాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్ సీఈవో పి.శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో మహిళలకు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీక్ వర్మ, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పీఏ రామకృష్ణమరాజు, యూపీఏ కన్వీనర్ డాక్టర్ జి.మెహర్ గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



బాలికలకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జమాతే ఇస్లామీ హింద్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉమెన్స్ వింగ్ కార్యకర్తలు అబీద మాట్లాడుతూ జననంలో తేడా లేనప్పుడు జీవన విధానంలో తేడా ఏమిటని, నేడు మహిళలకు పురుషులతో సమానంగా అన్ని హక్కులు కల్పించడం జరిగిందని, బాలికలకు మంచి భవిష్యత్తు ఏర్పడేలా ప్రభుత్వాలు అనేక సదుపాయాలు కల్పించాయన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా బాలికలపై దాడులు మానవాళి సిగ్గుపడేలా ఉన్నాయని, ఎంతో విచారకరమన్నారు. ఇంకా సమాజంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. అనంతరం బాలికలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. షేక్ బాబాజీ సాహెబ్, మారియా, ఆబీద, అక్తరి, జహీరా, శంషాద్ బేగం, గౌసియా, షేక్ బాబాజీ సాహెబ్, ఉపాధ్యాయులు జి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

- ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్
- భీమవరంలో బాలలకు 135 సైకిళ్ల పంపిణీ



భీమవరంలో రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలలకు సైకిళ్ల పంపిణీ చేసిన దృశ్యం

సాక్షి, భీమవరం: అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్‌ట్రస్ట్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. మంగళవారం భీమవరం 11వ వార్డులో రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గంటా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 135 సైకిళ్ల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ఆనందప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర గౌడ కార్పోరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించడానికి రాజ్‌కుమార్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఆయన అడుగుజాడల్లో మరింత మంది ముందుకు రావాలన్నారు. అనంతరం రాష్ట్ర దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడే యుగంధర్, కోడే విజయలక్ష్మి, పాలపర్తి జోనా, పాలవెల్లి మంగ, జంగం మాణిక్యాలరావు, వామపక్ష నాయకులు బి.బలరామ్, చెల్లబోయిన రంగారావు, లంక కృష్ణమూర్తి, సాదే మహేష్, డి.సతీష్, బి.పుష్ప, ఎం.సైమాన్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనాథ్

ఉండి: మద్యం తాగి వాహనాలను నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం డీఎస్పీ ఎ.శ్రీనాథ్ హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉండి మండలం వాండ్రం పరిధిలోని కోట్ల కల్యాణ మండపంలో ఆటో, వ్యాన్ తదితర డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో అనేక మంది రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారని, దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. ఎవరి మరణానికైనా కారకులయితే హత్య కేసు నమోదు చేస్తామన్నారు. వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని, అవి లేకుంటే జరిమానా విధిస్తామని అన్నారు. ఫిట్‌నెస్‌ను ఒకటికి రెండుసార్లు పరీక్షించిన తరువాతనే వాహనాన్ని నడపాలని సూచించారు. డ్రైవర్లు, వాహనచోదకులు, ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకే తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ నింబధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు గీతాకృష్ణ, ప్రసాద్, ఎస్సైలు వి.అప్పలరాజు, రామచంద్రరావు, గంగాధరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలి

సాక్షి, భీమవరం: తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలని పట్టణ తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం సభ్యులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావుకు వినతిపత్రం అందించారు. మంగళవారం భీమవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన నర్సింహారావును సంఘం అధ్యక్షుడు ఎస్.రామారావు ఆధ్వర్యంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు మెరగాని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర బీసీ జాబితాలో మూడు జిల్లాలకు చెందిన తూర్పుకాపులను మాత్రమే పరిమితం చేశారని, రాష్ట్రంలో అన్ని జిల్లాలోని తూర్పుకాపులను ఓబీసీ జాబితాలో చేర్చి రిజర్వేషన్స్ అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఏఎస్ఎస్ఎన్ మూర్తి, ఎం.నర్సింహమూర్తి, మెరగాని ప్రసాద్, తాళ్లపూడి గాంధీ, పరమేశ్వరరావు, ఎస్.ప్రకాష్, ఏకే నాయుడు, సీహెచ్ గంగాధర్ పాల్గొన్నారు.

శక్తీశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే శ్రీనివాస్



ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

భీమవరం అర్బన్: భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలో పురాతన ప్రాశస్త్యం గల పార్వతి సమేత శక్తీశ్వరస్వామివారిని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. శక్తీశ్వర స్వామివారి ఆశీర్వాదాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తొలుత ఎమ్మెల్యేకు కార్య నిర్వహణాధికారి కర్రి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, కొప్పర్తి సత్యనారాయణ, బద్దా శాంతారామ్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీకి నూతన పాలకవర్గం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌కు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి జీవో విడుదల చేసింది. గౌరవ చైర్మన్‌గా స్థానిక శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్, చైర్మన్‌గా కోటిపల్లి బాల దుర్గ నాగ మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా చిలకలపాటి సునీత, డైరెక్టర్లుగా మతల కాశీ విశ్వేశ్వరరావు, పొలమూరి బిల్‌రాజు, ముద్దల జగదాంబ, కండిబోయిన శ్రీలక్ష్మి, సాలా అశోక్ కుమార్, బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్, భూసారపు లక్ష్మీ ప్రసన్న, పులవర్తి ఆనంద సత్య నాగమణి, మహమ్మద్ అఫ్జల్ పాషా, పోడూరి వెంకటలక్ష్మి, కడలి ధర్మారావు, కట్రెడ్డి వెంకటేశ్వరరావు, గాదిరాజు సత్యశివ పార్వతి దేవి, కలిదిండి మురళీకృష్ణంరాజులతో పాటుగా జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఏడీ, మున్సిపల్ ప్రత్యేక అధికారి డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

సమాజ మార్పునకు కళలే ఆయుధాలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో ప్రజానాట్యమండలి ఎంతో కృషి చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ప్రజానాట్య మండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భీమారావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం ప్రజానాట్యమండలి చేసిన కృషి మరువరానిదన్నారు. 1943లో బొంబాయిలో ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజా చైతన్యం కోసం పనిచేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారామ ప్రసాద్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదని, ప్రజా చైతన్యం కోసం ఆవిర్భవించినది ప్రజానాట్యమండలి అన్నారు. స్వాతంత్ర పోరాటంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఇంకా అనేక ఉద్యమాల్లో ప్రజానాట్యమండలి పాత్ర ఎంతో ఉందన్నారు. కలిసెట్టి వెంకట్రావు, సీహెచ్ రంగారావు, పులకండం ఉగాది, చాంద్ బాషా, తిరుమాని కామేశ్వరరావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, కాటి వెంకటరత్నం, సలపల శ్రీను, ఆకలి రాము, కళాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల

భీమవరం అర్బన్: అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర ప్రభు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు పూర్తి స్థాయిలో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు రూ.36 కోట్లు నిధులతో అప్రోచ్ రోడ్లను నిర్మించేందుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నిధులు మంజూరు చేయించారని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు పట్టాలు మంజూరు చేశారన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. భీమవరం కేంద్రంగా కాళీపట్నం, దొంగపిండి, లోసరి, అనాకోడేరు రోడ్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు. నూతన రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రతిపాదనలు పంపారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, సర్పంచ్‌లు చిల్లే వెంకటేష్, కోళ్ల బాలకృష్ణ, రామాని శివాజీ వర్మ, తిరుమాని ధనంజయ రాజు, కేతా నాగబాబు, ఆరేటి పెద్దబ్బు, జిల్లా కొండయ్య, తెలి జోషఫ్ రవికుమార్, రామాని నరసింహస్వామి, తిరుమాని తులసీరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఆకివీడు: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఇద్దరు మంగళవారం వేరువేరు ఆసుపత్రుల్లో మృతి చెందినట్టు రైటర్ నాగభూషణం తెలిపారు. స్థానిక శ్రీరామపురానికి చెందిన కల్యాణం వరలక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పురుగుమందు తాగి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు. ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన కోట సూర్యారావు ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అల్లూరి విగ్రహం సందర్శన

సాక్షి, భీమవరం: పట్టణంలో పీఎం మోదీ ఆవిష్కరించిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, పార్టీ జాతీయ నాయకుడు శివప్రకాష్ సందర్శించారు. క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల సీతారామరాజు విగ్రహ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తుండడంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు భీమవరం విచ్చేసిన నాయకులు సీతారామరాజు విగ్రహాన్ని సందర్శించారు. వీరి వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భీమవరంలో రంగవల్లుల పోటీలను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ ముగ్గును కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు.
- భీమవరం (ప్రకాశం చౌక్)

సచివాలయాల్లోనూ విద్యుత్ సమస్యలు చెప్పొచ్చు

సాక్షి, భీమవరం: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి విద్యుత్ కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌సేవల్లో ఆటంకాలు ఏర్పడినా, సేవల్లో జాప్యం జరిగినా టోల్ ఫ్రీ 1921 నంబర్‌కు లేదా 94408 12707, 94408 12724, 94408 12725 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.